
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
మంగళవారం 30 జనవరి 2024





సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

వాడీవేడిగా

- ప్రొటోకాల్‌పై రగడ
- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు
- అటవీ అనుమతుల ఆలస్యంతో అభివృద్ధికి ఆటంకం

జడ్పీ సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్, జనవరి 29: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు అధ్యక్షత న జడ్పీ సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రివాల్, జడ్పీ సీఈవో రత్నమాల, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు హాజరయ్యారు. అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారని ప్రారంభోత్సవాలకు శంకుస్థాపనలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. సర్వ సభ్య సమావేశానికి, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఆయాశాఖల అధి కారులు ప్రొటోకాల్‌ను పాటించడంలేదన్నారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండానే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో కలెక్టర్ ప్రొటోకాల్ విషయంలో ఇక నుంచి ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని ఒక సర్క్యులర్‌ను జారీచేస్తామని ఇది పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా అటవీ అనుమతులు రావటంలో అలస్యం అవుతున్నదని అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమతుల ఆలస్యంతో జిల్లాలో అభివృద్ధి కుంటు పడుతోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఏజెన్సీ మండలాల్లో వంతెనలు, రోడ్లు నిర్మించుకోలేక పోతున్నామన్నారు. నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరైనా కేవలం అటవీ అనుమతుల సాకుతో వందల పనులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నామని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మిషన్‌భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా నీరు అందడంలేదన్నారు.

కొన్ని చోట్ల నల్లాలు లేని కారణంగా నీరు వృథాగా పోతోందన్నారు. ఆసిఫాబాద్ పట్టణంతోపాటు మిగతాగ్రామాల్లో నల్లానీరు సరఫరా కావడంలేదని రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటింటికి తాగునీరు అందేలా అధికారులు దృష్టి సారించాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లాలో కుమరంభీం, వట్టివాగు, జగన్నాథపూర్ ప్రాజెక్టుల పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేసి కాలువలను ఆధునీకరించాలన్నారు.

రైతాంగానికి చివరి పంటల వరకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులు కొనసాగించాలని అందుకు ప్రభుత్వం నుంచి ఏమైనా స్పష్టమైన ఆదేశాలు వచ్చాయా అని సభ్యులు ప్రశ్నించడంతో డిసెంబరు3 తర్వాత ప్రారంభించని పనులను చేపట్టకూడదని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని అధికారులు సభ్యుల దృష్టికి తీసుకురాగా గతంలో ప్రతిపాదించిన పనులను కొనసాగించాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

సమస్యలపై సభ్యుల నిలదీత..

వాంకిడి కళాశాల ఆవరణలో మిషన్‌భగీరథ పైపులైన్‌ను ఫోర్‌లైన్ నిర్మాణ కంపెనీ ధ్వంసం చేయడంతో కళాశాలకు వెళ్లే 300మంది విద్యార్థులకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని దాన్ని పరిష్కరించాలని వాంకిడి ఎంపీపీ విమల బాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ పథకం పూర్తిగా విఫలమైందని ఇంటింటికి నల్లానీరు రావడంలేదని ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. అడవిపందులు పంటలపై దాడిచేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులకు నష్టపరిహారం అందజేయాలని ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ అన్నారు.

పోడు పట్టాల భూముల్లో బోర్లు వేసుకొవడానికి అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడంలేదన్నారు. అనుమతులు ఇప్పించాలని రెబ్బెన జడ్పీటీసీ సంతోష్‌కుమార్ అన్నారు. రైతులకు రాయితీపై ఆయిల్‌ఇంజన్లను మంజూరు చేయాలని వాంకిడి జడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. ఆసిఫాబాద్ మండలంలో సెగ్రిగేషన్ షెడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని 22మంది సర్పంచులు సుమారు రూ.70నుంచి 80లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందుల పడుతున్నారన్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ అన్నారు. అందవెల్లి వంతెన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలన్నారు. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరించాలన్నారు. వర్షకాలం ప్రారంభమైతే పనులకు ఆటంకం కలుగుతుందని దహెగాం జడ్పీటీసీ శ్రీరామరావు అన్నారు.



హాజరైన సభ్యులు

సమన్వయంతో పనిచేయాలి..

కోనేరు కృష్ణారావు, జడ్పీచైర్మన్



అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అధికారు లు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ప్రొటోకాల్‌ను పాటించాలన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు..: హేమంత్ బోర్కడే, కలెక్టర్



అన్నిశాఖల అధికారులు ప్రొటోకాల్‌ను పాటించాలి. ప్రభుత్వపరంగా చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలి. ఈ విషయమై సర్క్యులర్‌ను జారీ చేస్తాం. పాటించని అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

అందవెల్లి వంతెన నిర్మాణానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి..

ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



అందవెల్లి వంతన నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలి. ఈ పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. నాలుగు నెలలు గడిస్తే వర్షాలు వస్తాయి. వర్షాలు ప్రారంభమైతే రాకపోకలకు ఆటంకం ఏర్పడి దహెగాం మండల ప్రజలు బాహ్యాప్రపంచానికి దూరం కావాల్సి వస్తుంది. అవసరమైతే నిధుల కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటాం.

ఆసిఫాబాద్-ఊట్నూర్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి..: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఆసిఫాబాద్ నుంచి కెరమెరి, జైనూరు నుంచి హస్నా పూర్ వరకు ఆసిఫాబాద్-ఊట్నూర్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలి. గుండివంతెన పనులను వర్షకాలం లోగా పూర్తి చేయా లి. మేకల కాపరులపై అటవి అధికారులు దాడులకు పాల్పడుతున్నారని ఈ చర్యలను మానుకోవాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీరు రావడం లేద న్నారు. మా ఇంటికే చుక్కనీరు రావడంలేదు ఇక ప్రజల పరిస్థితి ఏంటన్నారు. అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారు. పద్ధతి మార్చుకొవాలన్నారు.

ప్రొటోకాల్ విషయంలో అధికారులు పరిశీలించాలి..: దండే విఠల్, ఎమ్మెల్సీ



అధికారం, పదవులులేని నాయకులను అధికారులు ఆహ్వానిస్తున్నారు. ప్రొటోకాల్ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఎన్నికలలో ఓడి పోయిన అభ్యర్థుల నుంచి అధికారులు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. కేవలం ఎమ్మెల్యేల నుంచి వచ్చిన ప్రతిపాదనలనే అధికారులు తీసుకోవాలి. అటవీఅధికారులు మానవీయ కోణంలో అలోచించి అభివృద్ధికి సహకరించాలి

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపుకలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, జనవరి 29: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి కృషిచేస్తామని అదనపుకలెక్టర్ దాసరివేణు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో సురేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని ఈదులవాడకు చెందిన రామ్మూర్తి తాను గ్రామ శివారులో భూమిని కొనుగోలు చేసి ధరణిలో మ్యుటేషన్ చేయించుకున్నానని, కానీ తనపేరుకు బదులు వేరొకరి పేరువచ్చిందని సవరించాలని దరఖాస్తు అందజేశాడు. జన్కాపూర్ గ్రామానికి చెందిన పెంటన్న తనతండ్రి ప్రభుత్వ కార్యాలయంలో వాచ్‌మెన్‌గావిధులు నిర్వహిస్తూ మృతిచెందాడని ఇంటికి పెద్ద కుమారుడు అయినతనకు ఉద్యోగం ఇప్పించాలని అర్జీ సమర్పించాడు. కౌటాల మండలం గుడ్లబోరి సర్పంచ్ రాందాస్ తనకు 14నెలల జీతం రావాల్సి ఉందని ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. జిల్లాకేంద్రానికిచెందిన శ్రీనివాస్ తాను రెండు సంవత్సరాలుగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో దోబిగా విధులు నిర్వహిస్తున్నానని ప్రస్తుతం తనను తొలగించారని తిరిగి అవకాశం కల్పించాలని దరఖాస్తు అందజేశారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన దామోదర్ తన భూమిలో గిరివికాస పథకం కింద రెండు సంవత్సరాల క్రితం బోరు వేశామని, విద్యుత్ కనెక్షన్ ఇప్పించి ఆదుకోవాలని దరఖాస్తు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, బాలికల వసతిగృహం నైట్‌వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సులోచన తాను ఎనిమిది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నానని, తనఉద్యోగంలో ఏర్పడిన సమస్య ను పరిష్కరించి న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన కృష్ణమండల్ తనకు నజ్రుల్‌నగర్‌లో భూమి ఉందని నూతన పట్టాపాసు పుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

తునికాకు సేకరణను రద్దు చేసే ఆలోచన మానుకోవాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 29: అటవీ అధికారులు తునికాకు సేకరణ రద్దుచేసే ఆలోచనను మానుకోవాలని టీఏజీ ఎస్ నాయకులు అన్నా రు. సోమవారం తుని కాకు కల్లెదారుల సం ఘం, కేవీపీఎస్, డీవై ఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తునికాకుసేకరణ ఆదివాసులకు వ్యవసాయం తరువాత రెండోపంట అన్నారు. రైతులు, కూలీలు ఆకు సేకరణతో ఉపాధి పొందుతారన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు కాశీనాథ్, మాలశ్రీ, కమలాకర్, శైలేష్, శ్రీనివాస్, దినకర్, కార్తీక్, టికానంద్, రాజ్‌కుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆసిఫాబాద్, జనవరి 29: వాంకిడి మండలం తేజాపూర్ గ్రామపరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం కలెక్టర్ హేమంత్ బోర్కుడేకు వినతిపత్రం అందజేశారు. తేజాపూర్‌శివారులో నోటిఫైడ్ విలేజ్‌ఉండగా ఇష్టారాజ్యంగా వెంచర్లు వేయడానికి బడాబాబులు కొంతమంది ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కై అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అతితక్కువ ధరకేప్లాట్లు అమ్ముతామని నమ్మబలికి వెంచ ర్లు వేయడానికి సిద్ధమవుతున్నారని విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూశనరాజన్న, దినకర్, రాజ్‌కుమార్, ఆనంద్‌కుమార్, కార్తీక్, బాబురావు, సత్తయ్య, పోచయ్య, హనుమంతు, తిరుపతి, రమేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డైట్ స్కాలర్‌షిప్‌లు వెంటనే చెల్లించాలి

ఆసిఫాబాద్, జనవరి 29: సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, యూనివర్సిటీలకు జూన్ నుంచి డైట్ బిల్లులను విడుదల చేయలేదని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. తక్షణమే బిల్లులను విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వారు సోమవారం అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్, సాయికుమార్, నితీష్, నవీన్‌లు పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం

వాంకిడి, జనవరి 29: వాంకిడి మండలంలోని చౌపన్‌గూడ గ్రామ పంచాయతీలో సోమవారం సర్పంచ్ సిడాం అన్నిగా, వార్డు సభ్యులను గ్రామస్థులు సన్మానించారు. ఈనెల31తో పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది శాలువాలతో సన్మానించారు.

బాధితుడికి పరిహారం చెక్కు పంపిణీ



బాధితుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, అటవీశాఖాధికారులు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 29: కౌటాల మండల ముత్తంపేట శివారులో అడవిపంది దాడిలో గౌరుబాయి అనే మహిళ మృతిచెందగా ఆమె కుమారుడు గణపతికి సోమ వారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు రూ.5లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఇందులో రూ.2.5లక్షలు బాండ్ ఇవ్వగా, రూ.2.5లక్షల నగదును అంద జేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ టిబ్రివాల్, ఎఫ్ఆర్వోలు పూర్ణచందర్, ఎఫ్‌బీవో ప్రభాకర్, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 29: వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై సాగర్, కాగజ్‌నగర్ సబ్‌డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం.. 2022సంవత్సరంలో కాగజ్‌నగర్ పట్టణంలోని గుంటూరుకాలనీకి చెందిన మునిగల సదానందంను సర్‌స్కిల్క్ కాలనీకి చెందిన ఉయ్యాల గోపి హత్యచేసిన నేరంపై కేసు నమోదయింది. కాగా పీపీ జగన్‌మోహన్‌రావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా అప్పటి ఐవోలు సీఐ కె రవీందర్, ఎస్సై డి సాగర్ విచారణ జరపగా హత్యా నేరం రుజువైంది. దీంతో నేరస్తుడు ఉయ్యాల గోపికి జడ్జి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

దుప్పిని హతమార్చిన ముగ్గురికి రిమాండ్

సిర్పూర్(టి), జనవరి 29: సిర్పూర్(టి) రేంజ్ పరిధి లోని చీలపెల్లిబీట్‌లో చుక్కల దుప్పిని హతమార్చిన కేసులో సోమవారం దుర్గం సునీల్, దుర్గం సాయి, చెర్ల రాహుల్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎఫ్ఆర్వో పూర్ణచందర్‌రావు తెలిపారు. జడ్జి 14రోజుల రిమాండ్ విధించగా నిందితులను ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు. కాగా ప్రధాన నిందితుడు షాకీర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

వాంకిడి, జనవరి 29: మండలంలోని బంబార గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని సోమవారం జడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ అయోగ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బంబార నుంచి వెళ్తున్న నాలుగు వరుసల రహదారిని క్రాస్‌చేయడానికి ఎలాంటి అండర్‌పాస్ లేనందున ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డుక్రాస్ చేయడానికి ఒక కిలోమీటర్ దూరం యూటర్న్ ఉండడంతో పాటు ఇరువైపులా బారికేడ్‌లు ఉన్నందున బస్సులు ఎక్కడా నికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు నేపాజీ, వినోద్, సతీష్, అమృత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, జనవరి 29: సదరం శిబిరాలను జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిబ్రవరి 13న మూగ, చెవిటి, 15న కంటిచూపు, 20న మానసిక వైకల్యం, 27న ఎముకలు, మార్చి 11న మూగ, చెవిటి, 15న కంటిచూపు, 21న మానసిక, 26న ఎముకలవైకల్యంగల దివ్యాంగులకు శిబిరాలు నిర్వహిస్తామని, సంబంధిత పీహెచ్‌సీలలో వికలాంగత్వం పరీక్షలు చేయించుకొని స్లాట్ బుక్ చేసుకుని శిబిరానికి హాజరు కావాలన్నారు.



సామాజిక సేవలో సింగరేణి సేవా సమితి

- ఆకట్టుకున్న బొమ్మల కొలువు



బొమ్మల కొలువు ప్రారంభిస్తున్న సీఎండీ సతీమణి శారదబలరాం

మందమర్రిటౌన్, జనవరి 29: సింగరేణి యాజమాన్యం ఏర్పాటుచేసిన సింగరేణి సేవా సమితి సామాజిక సేవేలక్ష్యంగా పనిచేస్తుందని సీఎండీ సతీమణి శారదబలరాం అన్నారు. సోమవారం ఎల్లందు క్లబ్‌లో లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బొమ్మలకొలువు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాసమితి ద్వారా మహిళాసాధికారత, సంక్షేమంకోసం అనేకఉచిత,ఉపాధిశిక్షణ కార్యక్రమాలను ప్రవేశపెట్టి మహిళలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా బొమ్మల కొలువును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బొమ్మలకొలువులో నిర్వహించిన క్రీడా,ముగ్గులపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సేవాసమితి మందమర్రి ఏరియా అధ్యక్షురాలు సవిత మనోహర్, డైరెక్టర్ ఓపీఅండ్‌పా సతీమణి కళ్యాణిశ్రీనివాస్, శ్రీరాంపూర్ జీఎం సతీమణి భవానీబసివిరెడ్డి, ఎస్‌వోటూజీఎం సతీమణి శ్రీవాణి, జాయింట్ సెక్రెటరీ కవిత, కోశాధికారి ఊర్మిల, క్రీడలసెక్రెటరీ సుప్రియ, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి

శ్రీరాంపూర్, జనవరి 29: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని టీబీజీకేఎస్ మాజీ ప్రధానకార్యదర్శి పెద్దపల్లి కోటిలింగం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికాప్రకటన విడుదల చేశారు. కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, సింగరేణి యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు బాధ్యత తీసుకొని కోల్‌ఇండియా మాదిరిగా సింగరేణిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు.

అధికారుల సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్ రెడ్డి



వెంకటేశ్వర్ రెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 29: హోరాహోరీగా సాగినఎన్నికల్లో సింగరేణిఅధికారుల సంఘం(సీఎంఓఏఐ) శ్రీరాంపూర్ ఏరియా కార్యవర్గాన్ని ఆదివారం ఓటింగ్‌ద్వారా ఎన్నుకున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటలవరకు ఎన్నికలుజరిగాయి. అనంతరం అర్ధరాత్రివరకు ఓట్ల లెక్కింపు జరిగింది. అధ్యక్షుడిగా కె వెంకటేశ్వర్ రెడ్డి(101ఓట్లు), ఉపాధ్యక్షుడు-1గా లక్కాకుల మహేష్(73 ఓట్లు), ఉపాధ్యక్షుడు-2గా కాంధారి కిరణ్‌కుమార్(71ఓట్లు), కార్యదర్శిగా ఎంవీఎస్ఎ చంద్రశేఖర్(107 ఓట్లు), జాయింట్ సెక్రెటరీ-1గా షేక్ మహ్మద్‌గౌస్ పాషా (120ఓట్లు), జాయింట్ సెక్రెటరీ-2గాఆర్ భీమన్న (87 ఓట్లు), ట్రెజరర్‌గాభానోత్ రాము (101ఓట్లు), జాయింట్ ట్రెజరర్‌గా పి కోటేశ్వర్ రావు (102ఓట్లు)గా ఎన్నికయ్యారు. వీరికి మిగతా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

అధికారుల సంఘం అధ్యక్షుడికి సన్మానం

అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కె వెంకటేశ్వర్‌రెడ్డిని సింగాపూర్ మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి తిరుపతి, గోపతి తిరుపతి, రాజేశ్వర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కోలిండియాలో సింగరేణి సత్తాను చాటారు

మందమర్రిటౌన్, జనవరి 29: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇటీవల జరిగిన కోలిండియా హాకీపోటీల్లో సింగరేణి జట్టు విజేతగా నిలిచి సత్తాచాటడం గర్వంగా ఉందని మందమర్రిజీఎం మనోహర్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకా రులు శివకృష్ణ, కిరణ్‌ను ఘనంగా సన్మానించారు. జీఎం మాట్లాడుతూ భవిష్యత్‌లో సింగరేణిక్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలన్నారు.కార్యక్రమంలో రక్షణాధికారి రవీందర్, ఏఐటీయూసీ బ్రాంచిసెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, పీఎం శ్యాంసుందర్, అధికారులు రమేష్,గోవింద రావు, కార్తీక్,సంధ్యారాణి పాల్గొన్నారు.

మైనింగ్ సర్దార్ మృతికి యాజమాన్యం బాధ్యత వహించాలి

బెల్లంపల్లి, జనవరి 29: మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డిమృతికి సింగరేణి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్, ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ సోమవారం ఒకప్రకటనలో డిమాండ్‌చేశారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు చెల్లించాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గని ప్రమాద కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలకు సింగరేణి అధిక ప్రాధాన్యం: జీఎం



క్రీడా దుస్తులు అందిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, జనవరి 29: క్రీడలకు సింగరేణి సంస్థ అధిక ప్రాధాన్యం ఇస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో క్రీడాకరులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కోల్ ఇండియా ఇంటర్ హాకీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన జట్టు సభ్యులను సన్మానించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ, సంస్థ కల్పిస్తున్న సదుపాయాలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, ఎస్ వోటు జీఎం కె రఘుకుమార్, ఇందారం ఓసీపీ పీవో శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) పి అరవింద రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, జనవరి 29 : నస్పూర్ మున్సిపాలిటీ 4వ వార్డులో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య అన్నారు. సోమవారం కృష్ణకాలనీలో సీపీఐ మున్సిపల్ ముఖ్యుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాలనీలో కలుషిత తాగు నీరు సరఫరా అవుతోందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. పోచమ్మ ఆలయ నిర్మాణం చేపట్టాలని, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, కాలనీ నడుమ ఉన్న ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నగేష్ పాల్గొన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 4వ వార్డు కార్యదర్శిగా చిలుక రాంచందర్, సంయుక్త కార్యదర్శిగా పోతరాజుల విజయ్, కోశాధికారిగా ఇలవేణి సారంగపాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బత్తుల క్రాంతితో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నస్పూర్ పట్టణ టెంట్ హౌస్ కార్యవర్గం

నస్పూర్, జనవరి 29 : పట్టణ టెంట్ హౌస్ అసోసియేషన్ సభ్యుల సమావేశం స్థానిక నర్సయ్య భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ టెంట్ హౌస్ కార్యవర్గానికి ఎన్నికల జరిగాయి. నూతన కమిటీ అధ్యక్షుడుగా దాసారపు రవి, ఉపాధ్యక్షుడుగా మల్క రాజేశం, కోశాధికారిగా అల్తాఫ్ లను ఎన్నుకున్నారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 29: మున్సిపాలిటీలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో నెంబరు 40 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ప్రస్తుతం రూ.16,600 చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నారని వెంటనే వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. సోహైల్‌ఖాన్, రామస్వామి, తిరుపతి, లింగయ్య, సుధాకర్, శ్రీనివాస్, ఆసిఫ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న హరికృష్ణ

నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కార్యవర్గం

మందమర్రిరూరల్, జనవరి 29: తెలంగాణనాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మందమర్రి యూనిట్ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా ఎ.సుమన్, ఉపాధ్యక్షునిగా భిక్షపతి, సెక్రెటరీగా సీహెచ్ సతీష్, జాయింట్ సెక్రెటరీగా విద్యాలత, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కిశోర్, పబ్లిసిటీ సెక్రెటరీగా ప్రసన్నకుమార్, ట్రెజరర్‌గా సురేష్, ఈసీ మెంబర్లుగా విజయలక్ష్మీ, అమరేందర్ ఎన్నుకున్నట్లు తెలిపారు.

స్టాఫ్ నర్సుగా ఎంపిక

కోటపల్లి, జనవరి 29: మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన కొట్టె శరణ్య స్టాఫ్‌నర్సుగా ఎంపికయ్యారు. కుటుంబీకులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

నియామకం

జైపూర్, జనవరి 29 : వేలాల గ్రామానికి చెందిన చీర్ల శశీందర్ యాదవ్ భారత యాదవ హక్కుల పోరాట సమితి మంచిర్యాల జిల్లాయూత్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు పెండ్లి అంజన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు వంశీమోహన్‌యాదవ్‌లు నియామకపత్రం అందించారు.

నెహ్రూ యువజన కేంద్ర సభ్యుడిగా నియామకం

చెన్నూరు, జనవరి 29 : చెన్నూరు పట్టణానికి చెందిన బీజేపీ యువ నాయకుడు వంశీకృష్ణ నెహ్రూ యువజన కేంద్ర సంఘటనలో అడ్వైజరీ బోర్డ్ మెంబర్‌గా నియమితులయ్యారు. తనకుఈ అవకాశం ఇచ్చిన పార్టీ నాయకులు వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

తాండూర్, జనవరి 29 : తాండూర్ పశువైద్యశాలలో సోమవారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తామని పశువైద్యుడు మంచాల భూమయ్య తెలిపారు. యాజమానులకు పెంపుడు కుక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. 12 కుక్కలకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది నరేష్, కళ్యాణ్, గౌస్‌లు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

హాజీపూర్, జనవరి 29 : మండలంలోని ముల్కల్ల గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనిపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ నాయకుడు గడ్డం సతీష్‌యాదవ్ సోమవారం జిల్లా కలెక్టర్ సంతోష్‌కు వినతి పత్రం అందించారు. ఇసుక రాయల్టీ, ఇతర అభివృద్ధి నిధులను సర్పంచు, అధికారులు పక్కదారి పట్టించారన్నారు. వీరిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో కార్మికుడు మృతి

కాసిపేట, జనవరి 29: దేవాపూర్ సిమెంట్ కంపెనీలో కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న జాడి శ్రీకాంత్ (34) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు.

నేడు పొనకల్ సింగిల్ విండో చైర్మన్‌పై అవిశ్వాసం

జన్నారం, జనవరి 29: మండలంలోని పొనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం చైర్మన్ శీలం రమేష్‌పై మంగళవారం అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్లు సన్నాహాలు చేస్తున్నారు. రమేష్‌పై అవిశ్వాసం కోరుతూ సొసైటీలోని 9 మంది డైరెక్టర్లు అప్పటి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాస్ రెడ్డికి ఈ నెల 6న నోటీసులు అందజేశారు. నోటీసును ఇన్‌చార్జి డీసీవో స్టేట్ కో ఆపరేటివ్ సెక్రెటరీకి నివేదించగా వివరణ ఇవ్వాలని స్టేట్ కో ఆపరేటివ్ సెక్రెటరీ నుంచి చైర్మన్ రమేష్‌కు నోటీసు ఇచ్చారు. సొసైటీ డైరెక్టర్ల మద్దతు తనకు ఉందని రమేష్ హైకోర్టుకు వెళ్లారు. ఈ నెల 29 వరకు హైకోర్టు స్టే మంజూరు చేసింది. హైకోర్టు ఇచ్చిన గడువు సోమవారం ముగియడంతో మంగళవారం పొనకల్ సొసైటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతున్నట్లు డీసీవో నర్సయ్య తెలిపారు.

1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏసీసీ, జనవరి 29 : ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు మూడు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 16న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, 17న బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ ప్రాక్టికల్ పరీక్ష, 19న ఎన్విరాన్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం పరీక్షకు 1706 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 7031 మంది హాజరు కానున్నట్లు తెలిపారు.

కరాటే విజేతలకు బహుమతులు అందజేత

ఏసీసీ, జనవరి 29: మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పీఎస్ఆర్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులు అందించారు. అండర్ 14 బ్రౌన్‌బెల్ట్ విభాగంలో కరీంనగర్‌కు చెందిన అబ్దుల్, వేములవాడకు చెందిన అఫ్సర్, అండర్ 14 బాలికల విభాగంలో కరీంనగర్‌కు చెందిన శ్రీనిధి, మంచిర్యాలకు చెందిన నిహారిక విజేతలుగా నిలిచారు. బ్లాక్ బెల్ట్ చాంపియన్ విభాగంలో సుదేష్ విజేతగా నిలిచాడు. విజేతలకు ఎమ్మెల్యే నగదు పారితోషికం, కప్ అందించారు. నిర్వాహకులు పాల్గొన్నారు.



విజేతలతో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ముగిసిన వాలీబాల్ పోటీలు

మంచిర్యాల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ ఉట్నూరు జట్టు, ద్వితీయ ఎసన్‌వాయి, తృతీయ స్థానంలో మంచిర్యాల జట్లు నిలిచాయి. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు నల్ల శంకర్, మైలారం శ్రీనివాస్, ట్రినిటీ పాఠశాల కరస్పాండెంట్ బిజుకురువిల్లా, పోరెడ్డి రాజు, సురేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్రతో దాడి యువకుడి మృతి




సంపత్ (ఫైల్)

బెల్లంపల్లి, జనవరి 29: పట్టణంలోని బాబుక్యాంపు బస్తీలోని పద్మశాలిభవన్ ఎదుట సోమవారం జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం హనుమాన్ బస్తీకి చెందిన గాజవేని సంపత్ అలియాస్ శ్రీధర్, రాంనగర్‌కు చెందిన మొహినొద్దీన్‌లు ఇటుక ట్రిప్పుల విషయంలో గొడవ పడ్డారన్నారు. మొహినొద్దీన్ కర్రతో సంపత్ (44) తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరు కుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

కాసిపేట, జనవరి 29: కోమటిచేనుకు చెందిన శివ చికెన్ సెంటర్ యజమాని రాంటెంకి శివరాం, ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్‌లు పరస్పరం దాడి చేసుకోగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. చికెన్ సెంటర్‌లో వంట చెరుకు కోసం కట్టెలను నిల్వ చేయడంతో ఆదివారం ఫారెస్టు అధికారి ప్రవీణ్‌నాయక్ శివరాంను మందలించాడు. సోమవారం విధుల్లో భాగంగా కోమటిచేను వైపు వెళ్తుండగా శివరాం ఫారెస్టు అధికారిని అడ్డగించి దాడి చేయడంతో పాటు అసభ్యపద జాలంతో దూషించాడు. దీంతో ఇరువురు పరస్పరం దాడి చేసుకున్నారని, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంగ్ల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కాసిపేట, జనవరి 29: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి డ్రామా, స్పెల్ విజార్డ్ పోటీలను నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ అంజద్ పాషా మాట్లాడుతూ డ్రామా పోటీల్లో దేవాపూర్ జెడ్పీహెచ్ఎస్, కాసిపేట కేజీబీవీ పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. స్పెల్ విజార్డ్ పోటీల్లో రిషిత, ధరణిలు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మూర్తి, చౌదరి, అరుణకుమారి, పుష్పలతలు అభినందించారు.

జన్నారం: బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ భాష ఫోరం ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలను నిర్వహించారు. మండల కన్వీనర్ దాముక కమలాకర్, రాష్ట్ర ఇంగ్లీష్ భాష బాధ్యులు సత్యనారాయణ, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. స్పెల్ విజార్డ్ విభాగంలో అక్షర ప్రథమ, అంజన్ ద్వితీయ, డ్రామా పోటీల్లో మురిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, కిష్టాపూర్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు.

దండేపల్లి: ఆంగ్ల ఉపాధ్యాయుల అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ఆంగ్ల పోటీల్లో వెల్గనూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం పొందారు. స్పెల్ విజర్ పరీక్షలో వెల్గనూర్‌కు చెందిన శ్రీవైష్ణవి ప్రథమ, రెబ్బనపల్లికి చెందిన హిమ వర్షిణి ద్వితీయ స్థానం పొందారు. ఆంగ్ల డ్రామా ప్రదర్శనలో వెల్గనూర్ విద్యార్థులు ప్రథమ, మామిడిపల్లి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎంలు శంకర్ గౌడ్, విజయలక్ష్మి, రాజు, రాజిరెడ్డి, అభినందించారు.

భవిష్య నిధి భరోసానిస్తుంది

కాసిపేట, జనవరి 29: ప్రతీ కార్మికుని కుటుంబానికి భవిష్యనిధి భరోసా ఇస్తుందని కరీంనగర్ జోన్ పీఎఫ్ కమిషనర్ తానయ్య అన్నారు. నిధి ఆప్‌కే నికట్ 2.0 ఒకటో వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మికులతో ఈపీఎఫ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పీఎఫ్ వివరాలను కార్మికులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని, పీఎఫ్ ఖాతా నిలిచిపోయినట్లయితే మళ్లీ తెరుచుకోవాలన్నారు. కార్మికుని పీఎఫ్ ఖాతా సక్రమంగా నడుస్తుందో లేదో చూసుకోవాలన్నారు. కార్మికులకు ఈపీఎఫ్‌పై సందేహాలుంటే సంబంధిత కార్యాలయంలో కలవాలని సూచించారు. ఓరియంట్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏసీసీ, జనవరి 29: మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీ చౌరస్తా నుంచి పాత మంచిర్యాల వరకు రోడ్డు విస్తరణ పనుల కారణంగా రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ కలెక్టర్ ఆఫీస్ ఫీడర్, గోసేవ ఏరియా, ఐబీ, పాత మంచిర్యాల ఫీడర్‌ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గణపతి హోమం, అభిషేకం

నస్పూర్, జనవరి 29: హౌసింగ్ బోర్డు కాలనీలో గల లక్ష్మి గణపతి దేవాలయంలో సోమవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని గణపతి హోమం, 108 కిలోల ఎండు ద్రాక్ష పండ్లతో మహాద్రాక్ష ఫలాభిషేకం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు గంగవరపు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి ఫలాభిషేకం నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అభిషేకం అనంతరం పురవీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు తెలిపారు.

జిన్నింగు మిల్లులో అగ్ని ప్రమాదం

చెన్నూరు, జనవరి 29: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని వరలక్ష్మి జిన్నింగు మిల్లులో సోమవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు లేచాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది నీటితో మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

భవనాలు ప్రారంభం

కన్నెపల్లి, జనవరి 29: మండలంలోని లింగాలలో గ్రామపంచాయతీ కార్యాలయం, ఎంపీపీఎస్ పాఠశాల భవనాన్ని ఎంపీపీ మాధవరపు సృజననర్సింగరావు, సర్పంచు సీపెల్లి లక్ష్మీతిరుపతిలు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ రాకేశ్ శర్మ, ఎంపీటీసీ వరప్రసాదరావు, సర్పంచు నిర్మలసతీష్, మండల నాయకుడు మాధవరపు నర్సింగరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

ఏసీసీ, జనవరి 29: కేజీబీవీ మంచిర్యాలలో స్కావెంజర్, నస్పూర్‌లో అసిస్టెంట్‌కుక్, హాజీపూర్‌లో డ్రైవర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల నియామకానికి మహిళా అభ్యర్థులు అర్హులని, 7వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండి సంబంధిత మండలాలకు చెందిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఎంఈవో కార్యాలయాల్లో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు అందించాలన్నారు.

మా కుటుంబానికి న్యాయం చేయండి



రాస్తారోకో చేస్తున్న లింగాపూర్ గ్రామస్తులు

దండేపల్లి, జనవరి 29: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఓ పాస్టర్ బలవంతంగా మత మార్పిడిలకు పాల్పడుతున్నారని, ప్రశ్నించినందుకు అక్రమ కేసులు బనాయించారని ఆరోపిస్తూ గ్రామస్తులు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. లింగాపూర్ చెందిన బాధితురాలు నందిసుమ మాట్లాడుతూ, స్థానికంగా ఉన్న కొందరు అన్యమతస్తులు తనను మతం మారాల్సిందిగా ఒత్తిడి చేయడంతో భర్త నరేష్‌కు తెలిపానన్నారు. దీంతో ఆయన ఈ నెల 27న వారితో వాగ్వాదానికి దిగాడన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని భర్త నరేష్, మరిది సురేష్‌లపై పాస్టర్, తదితరులు దాడి చేశారని ఆరోపించారు. అంతేకాకుండా తన భర్త, మరిదిలపై కేసులు నమోదు చేయించి రిమాండ్‌కు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కోరారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రసాద్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. బాధితులు తహసీల్దార్ సంధ్యారాణిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎస్ఐ ప్రసాద్‌ను వివరణ కోరగా, విచారణ చేసిన తర్వాతనే చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని తెలిపారు.

నిరుపేదల విద్యాభ్యాసం కోసం కృషి

● ఎమ్మెల్సీ మిర్జారహిమత్ బేగ్

కాగజ్‌నగర్, జనవరి 29: నిరుపేదల విద్యాభ్యాసం కోసం ఏఐఎంఐఎం పార్టీ కృషి చేస్తుందని హైదరాబాద్ ఎంఎల్‌సీ మిర్జా రహిమత్ బేగ్ అన్నారు. సోమవారం ఆయన పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదల విద్యాభ్యాసం కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముబీన్, సెక్రెటరీ జావేద్, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

యువకులకు వాలీబాల్ కిట్

వాంకిడి, జనవరి 29: మండలంలోని గణేష్‌పురంలో సోమవారం యువకులకు ఎస్సై సాగర్ వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ, మండల స్థాయి క్రీడల్లో యువకులు తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎదగాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

రెబ్బెన, జనవరి 29: గోలేటి సింగరేణి పాఠశాలలో సోమవారం సింగరేణి పూర్వవిద్యార్థుల(మహాసమ్మేళనం11మెన్) ఆధ్వర్యంలో విద్యార్థులకు పదవతరగతి స్టడీ మెటీరియల్‌ను జీఎం రవిప్రసాద్, రెడ్డిమల్ల తిరుపతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బోగే ఉపేందర్, కోట సుధాకర్, గోలేం వెంకటేష్, మారం శ్రీనివాస్, ఎంస్ రాజు, కుమార్, వేణుగోపాల్, రవికుమార్, నరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటురంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, జనవరి 29: నిరుద్యోగ యువత ప్రైవేటు రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి ఎ రవికృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రధానమంత్రి కృషి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటురంగంలో ఉద్యోగంలో చేరి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 48మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా 13మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంపిక పత్రాలను అందజేస్తున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

బెజ్జూరు, జనవరి 29: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఆపరేషన్ స్మైల్‌ఇన్‌చార్జి ఎస్సై గంగన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా వివిధ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలని వారితో ఎలాంటి పనులు చేయించకూడదన్నారు. ఆయన వెంట చైల్డ్ కౌన్సిలర్ రవళి, లీగల్‌అడ్వైజర్ శ్రీనివాస్, పొటెక్షన్‌ఆఫీసర్ శ్రీమతి, సిబ్బంది రూప్‌సింగ్, రజిని పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ సీఐగా శంకరయ్య



శంకరయ్య

కాగజ్‌నగర్, జనవరి 29: కాగజ్‌నగర్ పట్టణ సీఐగా శంకరయ్యను కేటాయించారు. ఇక్కడ పనిచేసిన బుద్ధె స్వామి జగిత్యాలకు బదిలీ అయ్యాడు. ఆయన స్థానంలో బెల్లంపల్లి సీఐ శంకరయ్యను కాగజ్‌నగర్‌కు అధికారులు బదిలీ చేశారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్, జనవరి 29: సిర్పూరు పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా వైస్‌ప్రెసిడెంట్ అంబాల ఓదెలు అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఎస్పీఎంలో గుర్తింపుసంఘం ఎన్నికలు నిర్వహించకపోవటంతో మిల్లులో కార్మికచట్టాలు అమలు కావటం లేదన్నారు. మిల్లు పునరుద్ధరణ జరిగిన తర్వాత ఇంతవరకు పర్మినెంటు కార్మికులను పూర్తిగా తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం వెంటనే స్పందించి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేశారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

తిర్యాణి, జనవరి 29: మండలంలోని సహకార సంఘ బ్యాంకు మేనేజర్ రుషిదేవ్ దహెగాంకు బదిలీకావడంతో సోమవారం ఆయనను పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, సాగర్, బుచ్చన్న, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

జంగుబాయి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కెరమెరి, జనవరి 29: జంగుబాయి ఆలయానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం భారీగాభక్తులు తరలి వచ్చారు. తమ ఆరాధ్య దైవానికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ప్రతియేటా పుష్యమాసం ప్రారంభంలో ఈజాతరకు ఉమ్మడి ఆదిలాబాద్, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి దీపం రూపంలో దర్శనమిచ్చే జంగుబాయిని కొలుస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

జైనూర్: జంగుబాయి దేవత పూజల కోసం ఆదివాసులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించి జలదేవతను మొక్కుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.



నది వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సమ్మె నోటీసు అందజేత



డీఎంహెచ్‌వోకు నోటీసు అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆసిఫాబాద్, జనవరి 29: ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణభారత్‌బంద్‌లో ఆశావర్కర్లు పాల్గొంటారని తెలియజేస్తూ సోమవారండీఎంహెచ్‌వో తుకారాంకు ఆశావర్కర్లు సమ్మెనోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు




తీవ్రంగా గాయపడిన వెంకటేష్

రెబ్బెన, జనవరి 29: మండలంలోని రాంపూర్ బస్ స్టాప్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు నుంచి సిర్పూరు(టి)కు వెళ్లుతున్న క్రమంలో డ్రైవర్ వెంకటేష్(28) వాహనాన్ని అజాగ్రత్తగా అతివేగంగా నడపటంతో ఆటోబోల్తా పడింది. అక్కడే ఉన్న కొంతమంది వెంటనే స్పందించి 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108సిబ్బంది వెంటనే వెంకటేష్‌ను కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

5

మంగళవారం 30 జనవరి 2024



'పది' ఫలితాలపై ప్రత్యేక కార్యాచరణ

- పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- స్నాక్స్ అందించేందుకు నిధులు మంజూరు చేయాలి
- మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు

ఏసీసీ, జనవరి 29: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మంచి మార్కులు సాధించేలా విద్యార్థు లను తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. విద్యార్థి దశలో పదో తరగతి అనేది ప్రాధాన్యం కలిగింది. భవిష్యత్‌లో ఏ కోర్సు చదవాలని, జీవితంలో ఏ వృత్తిని చేపట్టాలనేది పదో తరగతి ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. పాఠ్యాంశాలపై అవగాహన కలిగి, సబ్జెక్టులపై మంచి పట్టు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఏ కోర్సు ఎంచుకున్నా అది వారికి గట్టి పునాదిలా ఉపయోగపడుతుంది.

పబ్లిక్ పరీక్షలకు ప్రత్యేక తరగతులు

జిల్లాలో ప్రభుత్వ, లోకల్ బాడీ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, మహాత్మాజ్యోతిపూబాలే బీసీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, మైనార్టీ రెసిడెన్షియల్, టీఎస్ఆర్ఎస్, గిరిజన ఆశ్రమ హైస్కూల్స్ కలిపి మొత్తం 166 పాఠశాలలు ఉన్నాయి. పదో తరగతి పరీక్షలకు 6035 మంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో బాలురు 3027, బాలికలు 3008 మంది ఉన్నారు. విద్యార్థులకు నవంబరు 11 నుంచి ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులను ప్రారంభిం చారు. రోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 వరకు జనవరి 2వ తేదీ వరకు నిర్వహించారు. జనవరి 2 నుంచి రోజు ఉదయంతోపాటు సాయంత్రం 4.45 నుంచి 5.30 గంటల వరకు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో రోజు ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టుకు సంబంధించి పాఠ్యాం శాల్లో విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడంతోపాటు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు రివిజన్ చేస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి.

నెలాఖరు వరకు సిలబస్ పూర్తి

పదో తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ జనవరి 31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రత్యేక తరగ తులు నిర్వహిస్తున్నందున నిర్దేశించిన కాల పరిమితిలోగా అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

స్నాక్స్ అందించేందుకు నిధులు విడుదల చేయాలి

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థుల కు స్నాక్స్ (అల్పాహారం) అందించేందుకు రూ.17 లక్షలు మంజూరు చేయాలని విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు విన్నవించారు. నిధుల కొరత ఉన్నందున మంజూరులో ఆలస్యం జరుగు తుందని అధికారులు చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సొంత డబ్బులతో బిస్కట్‌లు అందించారు. ఆదివారం కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. దీంతో విద్యాశాఖ అధికారులు నిధుల మంజూరు అంశాన్ని ప్రస్తావించారు. డీఎంఎఫ్‌టీ ఫండ్ నుంచి అయినా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాల కోసం అనుసరించాల్సిన పద్ధతులు, విద్యార్థుల సన్న ద్ధత, సిలబస్ పూర్తి తదితర అంశాలపై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో డీఈవో యాదయ్య సోమవారం జిల్లా సైన్స్ కేంద్రంలో సమావేశం నిర్వహించారు.

ఈ నెల 31లోగా సిలబస్ పూర్తి చేయాలి

ఏసీసీ: పదో తరగతి సిలబస్‌ను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల ప్రభుత్వ, కేజీబీవీ, ఎయిడెడ్, టీఎస్ఎంఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. పదిలో వందశాతం ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు అమలు చేస్తున్న ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. డీఈవో మాట్లాడుతూ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ రివిజన్ చేయాలని సూచించారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న ప్రీ ఫైనల్ పరీక్ష, గ్రాండ్ టెస్టుకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు. ఏసీజీఈ దామోదర్‌రావు, డీసీఈబీ సెక్రెటరీ భీంరావు, ఎంఈవోలు తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్, ప్రభాకర్, మహేశ్వర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారులు సత్యనారాయణమూర్తి, యశోదర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి

ఎం. అర్చన,పదవ తరగతి, జడ్పీహెచ్ పాఠశాల, ముల్కల్ల



ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం సమయం కేటాయించి పబ్లిక్ పరీక్షల కోసం తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి స్నాక్స్ అందిస్తే మరింత తోడ్పాటుగా ఉంటుంది.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డీఈవో యాదయ్య

జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై సానుకూల దృక్పథాన్ని ఏర్పరిచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, అందరం సమన్వయంతో కృషి చేస్తున్నాం.

9న మున్సిపల్ ప్రత్యేక సమావేశం

నస్పూర్, జనవరి 29: నస్పూర్ మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశం 9వ తేదీన ఉదయం 11 గంటలకు జరగనుంది. చైర్మన్‌గా కొనసాగిన ఈసంపల్లి ప్రభాకర్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడం, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరి పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వచ్చే నెల 9న ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జైపూర్, జనవరి 29: మండలంలోని ఇందారం, జైపూర్, కుందారం, పౌనూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 25 గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ


సీఐ అశోక్

నస్పూర్, జనవరి 29: మంచిర్యాల రూరల్ సీఐగా ఆకుల అశోక్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సంజీవ్ బదిలీపై వెళ్ళగా రామగుండం సీసీఆర్‌బీలో పని చేస్తున్న అశోక్‌ను అధికారులు ఇక్కడకు బదిలీ చేశారు.

నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపిక


మహేష్

కోటపల్లి, జనవరి 29: మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల విడుదల చేసిన ఉద్యోగ ఫలితాల్లో నక్కలపల్లి గ్రామానికి చెందిన నల్ల మహేష్ నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 1వ జోన్‌లో మొత్తంగా 937 పోస్టులు ఉండగా 327 ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. మహేష్ చిన్నతనంలోనే తండ్రి రామయ్య మృతి చెందగా తల్లి మొండక్క వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తుంది. మహేష్ ఎంపికపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

పంచాయతీ అభివృద్ధి సమావేశం

కన్నెపల్లి, జనవరి 29 : కన్నెపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశం ఎంపీపీ సృజన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 2024-25కు సంబంధించిన అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. మండలంలోని అభివృద్ధి పనులపై అధికారులు నివేదికలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ, ఎంపీటీసీలు నెండుగూరి భారతి, వరప్రసాద్, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 29: ప్రజలు పౌర హక్కులు, ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అట్రాసిటీ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 2012 నుంచి 2022 వరకు వివిధ కేసుల్లో 447 మంది బాధితులకు రూ. 4,75,44,750 పరిహారం మంజూరు అందించామని తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో సివిల్ రైట్స్‌డే సందర్భంగా గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీసీపీసుధీర్‌రాంనాధ్‌కేకన్ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు ఎస్‌హెచ్‌వోలు, సీఐలు, ఎస్ఐలతో విచారణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్డీవో రాములు, ఏసీపీలు తిరుపతి, మోహన్, షెడ్యూల్డు కులాల అభివృద్ధి ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, వయోజన విద్యాధికారి పురుషోత్తం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి

అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులతో సహజ పర్యావరణాన్ని రక్షించడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ సుధీర్‌రాంనాధ్‌కేకన్, జిల్లా పశు వైద్య సంయుక్త సంచాలకులు రమేష్, సహాయ సంచాకులు శంకర్‌తో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అడవులు, సరస్సులు, వన్యప్రాణులను రక్షించాలన్నారు. పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్డీవో రాములుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పలు ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు సహకరించాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 29: కుష్ఠు వ్యాధి నివారణకు అందరూ సహకరించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు పేర్కొన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వ హిస్తామన్నారు. జనవరి 30న యాంటీ లెప్రసీ డే సందర్భంగా గ్రామసభలు నిర్వ హించి ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. స్పర్శ లేని ఎర్రని రాగి రంగు, గోధుమ రంగు మచ్చలు ఉంటే ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు నీరజ, అనిత, మాస్ మీడి యా అధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో లింగారెడ్డి, డీపైపీఎంవో శివకుమార్, రాఘవయ్య, హెచ్‌ఏ సునీల్ పాల్గొన్నారు.

ఐడీ కార్డుల అందజేత

మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎంప్లాయి ఐడీ కార్డు, సెలెక్టడ్ కాపీలను డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 266 మంది ఎంపికయ్యారని, బుధవారం హైద్రాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు.

కుల గణనతోనే సంక్షేమం

మందమర్రిటౌన్, జనవరి 29 : కుల గణనతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని మందమర్రి ఆది జాంబవంతుల కమిటీ అధ్యక్షుడు వాసాల శంకర్, ప్రధాన కార్యదర్శి బెదనూరి శంకర్‌లు తెలిపారు. సోమవారం మందమర్రిలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కుల గణనను విస్మరించాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే కుల గణన చేపట్టడానికి నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్, జనవరి 29 : మందమర్రిలో ఫైరింజన్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల సతీష్‌బాబు, వేముల శ్రీనివాస్‌లు ఎంపీడీవో శశికళకు వినతి పత్రం అందించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంచిర్యాల, బెల్లంపల్లిల నుంచి ఫైరింజన్ వస్తుందని, ఫైరింజన్ రావడం ఆలస్యమై నష్టం జరుగుతుందన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, నిరసన తెలుపుతున్న మెప్మా ఆర్పీలు

నస్పూర్, జనవరి 29: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్‌కు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ చాలా కాలంగా వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన మెస్ బిల్లులు రావడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో చదువుకునే విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలన్నారు. విద్యారంగంలో ఖాళీగా ఉన్న 26వేల ఉపాధ్యాయ పోస్టులను, ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీతో పాటు పారిశుధ్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. డైట్ బిల్లులను విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోనం అందించాలని పది, ఇంటర్ విద్యార్థులకు స్పెషల్ మెనూ ఇవ్వాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, నాయకులు అభినవ్, సత్యనారాయణ, దినేష్, రాజు, రాంచరణ్ పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల నిరసన

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ లో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆర్పీలు నిరసన వ్యక్తం చేశారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.4వేల చొప్పున, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రూ. 6వేల చొప్పున వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆర్పీలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించి సమస్య పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. మాట్లాడుతూ ఆర్పీలకు రూ. 20వేల గౌరవ వేతనం, ప్రభుత్వ పరంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. ఆర్పీలకు డ్రెస్ కోడ్ అమలు చేసి 10 లక్షల ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. నాయకులు అరుణ, మంగ, రుక్మిణి, విజయలక్ష్మి, అరుణ, కోమల, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక


ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

నెన్నెల, జనవరి 29: ఉపాధిహామీ పథకంలో ఏడాది కాలంలో చేపట్టిన పనులపై సోమవారం 13వ విడత ప్రజావేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ప్రజావేదికలో నివేదించారు. ఆరోపణలు వచ్చిన సిబ్బందిని అధికారులు వివరణ కోరారు. సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని సిబ్బందికి రూ.6749లు జరిమానా విధించారు. 19 గ్రామ పంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.3 కోట్ల 23 లక్షలతో 307 పనులు చేపట్టారు. కూలీలకు వేతనంగా రూ.3 కోట్ల 15 లక్షలు, సామగ్రి కోసం రూ.8 లక్షలు వ్యయం చేసినట్లు అధికారులు వివరించారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు. అర్హులైన వారికి పని కల్పించి, వారికి సకాలంలో వేతనాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అదనపు డీఆర్‌డీవో దత్తారావు, ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ శివరాం, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శంకరమ్మ, జిల్లా విజిలెన్స్ అధికారి సురేష్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కిరణ్, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ సాయిలు, ఎంపీడీవో వరలక్ష్మి, ఏపీవో నరేష్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయాలు ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచు

కోటపల్లి, జనవరి 29 : మండలంలోని కోటపల్లి, సర్వాయిపేట, వెల్మపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాలను సోమవారం ఎంపీపీ మంత్రి సురేఖ రామయ్యతోపాటు సర్పంచులు రాగం రాజక్క, పసునూటి వసంతకుమారి, సత్యనారాయణరావులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామపంచాయతీల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగా వీటి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పాలనపరంగా ప్రజలకు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఉపసర్పంచు విజయ్, నాయకులు బైస ప్రభాకర్, రాళ్లబండి శ్రీనివాస్, రాగం స్వామి, శ్రీకాంత్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో పర్యటించిన ప్యానల్ టీం


మాట్లాడుతున్న ప్రోగ్రాం కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు

కాసిపేట, జనవరి 29: మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలలో సోమవారం అకడమిక్ ప్యానల్ టీం సభ్యులు పర్యటించారు. టీం కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించామన్నారు. అలాగే విద్యార్థుల ప్రగతిపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టామన్నారు. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికబద్ధంగా చదువుకుని పరీక్షలు రాయాలన్నారు. అనంతరం హాస్టల్‌లోని సౌకర్యాలు, భోజనాన్ని, రిజిష్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు అజ్మీర నర్సింహా, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ


అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ బీటెన్‌సింగ్

కాసిపేట, జనవరి 29 : పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించుకోవచ్చని ఎన్‌డీఆర్ఎఫ్ విజయవాడ 10వ బెటాలియన్ కమాండెంట్ బీటెన్ సింగ్ అన్నారు. సోమవారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగి పొగలు వ్యాపిస్తే నేలపై పడుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్ని కీలలు ఎక్కువగా వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులు ప్రమాదానికి గురై స్పృహ కోల్పోయినప్పుడు సీపీఆర్ పద్ధతి ద్వారా గుండెకు శ్వాస అందించి సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. అనంతరం ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలను ప్రదర్శనలు చేసి వివరించారు. ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ భోజన్న, ఓరియంట్ కంపెనీ అధ్యక్షుడు సత్యబ్రత్ శర్మ, కంపెనీ అధికారులు తిరుపతి , కార్మికులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల విడుదల


క్యాలెండర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఏసీసీ, జనవరి 29 : జిల్లా మున్నూరు కాపు సంఘం క్యాలెండర్లను సోమవారం జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌పోర్టు భవన్‌లో సంఘం నాయకులు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మిట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ సంఘం తరుపున వధువుకు పుస్తె, మట్టెలు, పట్టు వస్త్రాలు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు ఉచితంగా అందిస్తామన్నారు. పట్టణాధ్యక్షుడు బొలిశెట్టి కిషన్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల నరేష్, ఉపాధ్యక్షుడు పూదరి తిరుపతి, అగ్గి సత్యం, బాపన్న, శ్రీనివాస్, పోచమల్లు, సత్యనారాయణ, సురేష్, రాజు, నారాయణ, ఆగయ్య , కేశవులు, బాపు, శ్యాంసుందర్, సదానందం పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్ లీకేజీ


లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

మందమర్రిటౌన్, జనవరి 29: పట్టణంలోని పాలచెట్టు ఏరియా కోల్‌బెల్ట్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నీరంతా రోడ్డుపై ప్రవ హించింది. నీరు లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భగీరథ పైపలైన్‌లు తరుచూ పగిలిపోయి నీరు లీకేజీ కావడం తరుచూ జరుగుతుందని తెలిపారు. అధికా రులు స్పందించి పైపులు లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.